


www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 02 | జూన్ | 2026
పేజీలు : 8

# చెలరేగిన మట్టి మాఫియా..!





**-అధికారుల అండ.. ఆపై అధికార ముద్ర**

**-హైవేల పేరుతో తరిగిన గుట్టలు**

**-చెరువులపై అక్రమార్కుల కన్ను**

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం జిల్లాలో మట్టి మాఫియా మళ్లీ అక్రమ దందా మొదలు పెట్టింది. గుట్టలు తరిగిపోవడంతో ఇప్పుడు అక్రమార్కుల కన్ను చెరువులపై పడింది. రైతుల పేరుతో పొలాలకు మట్టి తొలకం అన్న పేరుతో అనుమతులు పొంది యథేచ్చగా రియల్ వెంచర్లకు, వ్యాపార సముదాయాలకు తరలిస్తున్నారు. నిబంధనలకు తిలోదకాలు ఇచ్చి జరుగుతున్న మట్టి తరలింపులపై నీటిపారుదల శాఖాధికారులు గోడమీద పిల్లి చందంగా వ్యవహరిస్తున్నారు. మట్టి అక్రమంగా తరలిస్తున్న మౌనంగా ఉండటం, తరలింపు వ్యవహారం రచ్చకెక్కి గ్రామాల్లో ఘర్షణలు, అడ్డగింతలు ప్రారంభమైతే అలా జరగటానికి వీలు లేదు. అనుమతులు రద్దు చేస్తున్నామని ప్రకటన ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. మధిర మున్సిపాలిటీ పరిధిలోని మడుపల్లి ఊరచెరువు వ్యవహారంలోనూ ఇదే జరిగింది. వారం రోజులకు పైగా యథేచ్చగా మట్టి తరలించటం, అడ్డుకున్న వ్యక్తులను గాయపర్చిన తర్వాత చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకున్నట్లు చిన్న ప్రకటన ఇచ్చి తమ తప్పు ఏమి లేదని చంకలు గుద్దుకుంటున్నారు.

మిగతా 2లో..









# చెలరేగిన మట్టి మాఫియా..!

(మొదటిపేజీ తరువాయి)

అనుమతుల వెనక చక్రం తిప్పిన అధికార పార్టీ నాయకుడెవరు , అధికార పార్టీ సాను కూలత లేకుండానే అనుమతులు ఇచ్చారా, ఆ స్థితి మధిర నియోజక వర్గంలో ఉందా అన్న ప్రశ్నకు సమాధానం లేదు. ఇంత వరకు మట్టి తరలించి దాడులకు పాల్పడిన వారిపై క్రిమినల్ కేసులు ఎందుకు నమోదు చేయలేదు. అధికార పార్టీ నాయకులతో ఫోన్ చేయించండి అని చెప్పి ఫోన్ రాగానే దానిని అడ్డుపెట్టుకుని అడ్డగోలు అనుమతులు ఇవ్వటం ఆనవాయితీగా మారింది. పాలేరు నియోజక వర్గం కూసుమంచి మండలం తురకగూడెం చెరువు నుంచి వారం రోజుల పాటు యథేచ్ఛగా మట్టి తరలించటం జరిగింది. రాత్రింభవళ్లు మట్టిని తరలించిన తర్వాత గ్రామస్తుల ఫిర్యాదుకు నీటిపారుదల అధికారులు స్పందించారు. కాకపోతే మదుపల్లి ఘటనకు ఇక్కడ పూర్తి విరుద్ధంగా జరిగింది. నీటిపారుదల శాఖాధికారులు అర్థరాత్రి దాడులు చేసి రెండు జేసిబిలు, 25 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాలతో పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు



సమాయత్తం కాగా అధికార పార్టీ నేతలు, ప్రజా ప్రతినిధుల నుంచి ఫోన్ కాల్స్ రావటంతో అధికారులు అడుగు ముందుకు వేయలేకపోయారు. ఇంత వరకు మట్టి తరలింపుకు సంబంధించి అధికారులు ఏమి చెప్పలేని స్థితి. అధికారులపై అధికార పార్టీ ఒత్తిళ్లు తేవడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికార దర్పం ప్రజలకు ఉపయోగపడాలి కానీ అక్రమార్కులకు అండగా నిలవకూడదన్న సత్యాన్ని గ్రహించలేకపోతున్నారు. ఇదే అదనుగా కొందరు అధికారులు అక్రమానికి వంత పాడుతున్నారు. ఇప్పటికే హైవేల నిర్మాణంతో జిల్లాలో గుట్టలు కనుమరుగయ్యాయి. పర్యావరణం ప్రమాదంలో పడుతుందని తెలిసినా హైవేలకు మట్టి వనరులను కేటాయించక తప్పని స్థితి. ఇదే సమయంలో చెరువుల్లో పూడిక మట్టిని పంట పొలాలకు రైతులు తరలిస్తే సరే కానీ అధికార పార్టీ ముసుగులో అధికారులపై ఒత్తిడి తెచ్చి అక్రమంగా తరలించే వారిపై తగు చర్యలు తీసుకోవాలి. లేకుంటే పైరవీలు, మామూళ్ల మత్తులో చెరువుల ఆనవాళ్లు కోల్పోయి నిరూపయోగంగా మారతాయి.




## తీర్థాలలో బహిరంగ వేలం పాట



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలం తీర్థాల గ్రామంలోని శ్రీ సంగమేశ్వర స్వామి ఆలయంలో కొబ్బరికాయలు, పూజాసామాగ్రి విక్రయ హక్కుల కోసం ఈ నెల 4వ తేదీ ఉదయం 10:30గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వేణుగోపాలాచార్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పాల్గొనదలచినవారు రూ.25వేలు సంఘం రుసుము(డిపాజిట్) చెల్లించి అర్హత పొందాలని సూచించారు. పాట దక్కించుకున్న వారు మిగిలిన మొత్తాన్ని 90రోజుల వ్యవధిలో చెల్లించే విధంగా నిబంధనలు రూపొందించినట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

## ఉద్యోగాల సాధనలో ప్రియదర్శిని విద్యార్థినుల ప్రతిభ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థినుల ప్రముఖ ఐటీ సంస్థలైన టెక్ మహీంద్రా, కాగ్నిజెంట్ సంస్థల్లో ఉద్యోగాలు సాధించి కళాశాకు గర్వకారణంగా నిలిచారని కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన విద్యార్థినులు రూ.6, రూ.5లక్షల వార్షిక వేతన ప్యాకేజీతో ఉద్యోగ అవకాశాలు పొందినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతిష్టాత్మక ఐటీ సంస్థల్లో ఉద్యోగాలు సాధించడం ద్వారా విద్యార్థినులు కళాశాల ప్రతిష్టను మరింత ఉన్నతస్థాయికి తీసుకెళ్లారని అన్నారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ అట్లూరి వెంకట రమణ విద్యార్థినులను అభినందించారు.















# సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలి

**-ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు**



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని ఖమ్మం డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు కొంగర వెంకటేశ్వరరావు తెలిపారు. మండల పరిధిలోని చిమ్మపుడి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కోటేరు నర్సిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడిఏ కొంగర వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. రైతులకు నిగ్రాణి సమితులు దాని ఆవశ్యకత రసాయనిక ఎరువుల యాజమాన్యం, కేతి బచావో అభయాన్ ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా నిగ్రాణి సమితులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమితులకు సర్పంచ్ అధ్యక్షులుగా ఉంటారని గ్రామ పంచాయతీ సెక్రటరీ, వ్యవసాయ విస్తరణ అధికారి, అభ్యుదయ రైతు ఈ సమితులలో సభ్యులుగా ఉంటారన్నారు. రసాయనిక ఎరువుల వినియోగం, సరఫరా, నిఘా ఈ సమితులు పర్యవేక్షిస్తాయన్నారు. రైతులు పంట వ్యర్థాలను కాల్చకుండా భూమిలో కలియబెట్టాలని తద్వారా సేంద్రియ కార్బన్ మెరుగవుతుందన్నారు. ఏవో కర్నాటి ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రైతులు పంటల మార్పిడి విధానాన్ని అవలంభించాలన్నారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేపట్టాలని ప్రభుత్వం కూడా పలు రాయితీలను అందిస్తుందని తెలిపారు. సర్పంచ్ నర్సిరెడ్డి మాట్లాడుతూ అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ రైతులు సేంద్రియ పద్ధతులు అవలంభిస్తూ అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో శ్రీకాంత్, వార్డు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.







## ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని శివాయిగూడెం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. సోమవారం సర్పంచ్ సునీత నంద్యా ఆధ్వర్యంలో కూలీలకు పని ప్రదేశంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున కూలీలకు మజ్జిగ పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కూలీలు వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చెరుకూరి ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి రోజా, వార్డు సభ్యులు పాల్గొన్నారు.







## వైరా మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు



**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపల్ కమీషనర్‌గా ఎం.రామచంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కమీషనర్ రామచంద్రరావుకు మున్సిపల్ సిబ్బంది మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం కమీషనర్ మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు నిర్వహించాలి. మున్సిపాలిటీ ఆదాయం పెంచేవిధంగా అధికారులు కృషి చేయాలి, అవినీతి ఆరోపణలు వస్తే సహించేది లేదు అని ఆయన అన్నారు. ప్రజలు సమస్యలను నేరుగా నన్ను కలిసి వివరించాలని పనులు కోసం దళారులను ఆశ్రయించవద్దని ఆయన సూచించారు.









## పట్టి రొట్ట విత్తనాల పంపిణీ



ప్రజాపక్షం/అశ్వాపురం: మొండికుంట సొసైటీలో నిర్వహించిన పట్టి రొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సహాయ డైరెక్టర్ బి తాతారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు పంట అవశేషాలను కాల్చడం వల్ల కలిగే నష్టాలు, విశ్వ విద్యాలయం సూచించిన మెరుగైన వరి రకాలు, పచ్చి రొట్ట పంటల ప్రయోజనాలు, భద్రగిరి మార్ట్‌లో సేంద్రీయ ఉత్పత్తుల విక్రయం గురించి వివరించారు. అలాగే రైతుల ఎఫ్ఆర్ పెండెన్సీ అంశంపై చర్చించారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తుక్కని మధుసూదన్‌రెడ్డి, ఏవో ఎస్ఎంసి చటర్జీ, ఏఈవోలు కె రమేష్, డి రమాదేవి, రైతులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

### నేలకొండపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతు సంక్షేమ ప్రభుత్వమని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతువేదికలో నేలకొండపల్లి సహకార సంఘం (సొసైటీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సబ్సిడీ జీలుగు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ సీతారాములు మాట్లాడుతూ, రైతును రాజుగా చూడాలనే ఉన్నత లక్ష్యంతోనే ప్రభుత్వం రైతాంగం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందని తెలిపారు. పంటలకు బోనస్, మద్దతు ధర కల్పించడంతో పాటు, సబ్సిడీపై విత్తనాలు, ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని స్పష్టం చేశారు. రైతులంతా సొసైటీల ద్వారా పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట (జీలుగు) విత్తనాలను సద్వినియోగం చేసుకుని, భూసారాన్ని పెంచుకోవడం ద్వారా సాగులో అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. రైతుల అభ్యున్నతికి, సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ తీగ రమణయ్య, మండల వ్యవసాయాధికారి యం.రాధ, సొసైటీ కార్యదర్శి ఖమ్మం వెంకటేశ్వరు, కనపర్తి నాగేందర్, ఏఈవో లు దుర్గాభవాని, శిరీషా, అరవింద్, రైతు ప్రతినిధులు నల్లాని మల్లిఖార్జునరావు, ఉండమోదుగుల శ్రీను, రాము, ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.


## రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి



ప్రజాపక్షం/నేలకొండపల్లి : రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకలను గ్రామ, గ్రామానా ఘనంగా నిర్వహించాలని నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోడాలి గోవిందరావు సూచించారు. నూతన మండల అధ్యక్షుడుగా నియమించిన సందర్భంగా మండలం లోని రాయగూడెం పంచాయతీ సర్పంచ్ బోయిన వేణు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీని గ్రామ స్థాయి లో విస్తరించేదుకు ప్రతీ ఒక్కరూ పని చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల గురించి ఇంటింటికి వెళ్ళి విస్తతంగా ప్రచారం చేయాలని సూచించారు. అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తారన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మండలం లో త్వరలోనే గ్రామ, బూత్ కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆవతరణ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బోయిన నరసింహారావు, నాగరాజు, కృష్ణ, కోసూరి పానకాలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గూడు కట్టుకున్న సంతోషం..!

### ఇందిరమ్మ గృహ ప్రవేశాలు



ప్రజాపక్షం/నేలకొండపల్లి : గతేడాది ఫిబ్రవరి లో శ్రీకారం చుట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతి చాటుకుంది. మండలం లోని తొలి విడత 450 ఇళ్లు మంజూరు కాగా ఎట్టకేలకు ఇళ్ళ ను నిర్మించుకున్నారు. మండలం లోని మంగాపురంతండా, మోటాపురం తదితర గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాల ను సోమవారం నిర్వహించారు. ఇంటి ని నిర్మించుకున్న లబ్ధిదారులలో గృహ ప్రవేశాల సందర్భంగా సంబురంలో పాల్గొన్నారు. సొంతింటి కల నెరవేరిందని పేదింట సంతోషంలో పాలుపంచుకున్నారు. మంగాపురంతండా సర్పంచ్ ధీరావత్ ఆశోకరాణి చేతుల మీదుగా గృహ ప్రవేశాల కార్యక్రమం ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ధీరావత్ బాలాజీ, మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యాక్షుడు ధీరావత్ రాధాకృష్ణమూర్తి, గోబ్రియా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్పీ భూములను మింగేస్తున్న భూ బకాసురులు..!

-కోట్లాది విలువైన ప్రభుత్వ మట్టి తరలింపు
-చోద్యం చూస్తున్న అధికారులు
-కలెక్టర్ జోక్యం కోరుతున్న గ్రామస్తులు







ప్రజాపక్షం/ఖమ్మం : ఏన్కూరు మండలంలో కోట్లాది రూపాయల విలువైన నాగార్జునసాగర్ ప్రధాన కాలువ(ఎన్ఎస్పీ)పరిధిలోని ప్రభుత్వ భూములు, మట్టి అక్రమ తవ్వకాలతో క్రమంగా కనుమరుగవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భూములను, కాలువ కట్టలను కాపాడాల్సిన సంబంధిత శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏన్కూరు సమీపంలోని నాగార్జునసాగర్ ప్రధాన కాలువ కట్టల నుంచి విలువైన మట్టిని కొందరు కాంట్రాక్టర్లు భారీ ఎత్తున తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు మట్టి రవాణా కొనసాగుతున్నప్పటికి సంబంధిత అధికారులు పట్టించుకోకవడం లేదని విమర్శిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే అనుమతులు ఉన్నాయి అంటూ అధికారులు సమాధానం చెబుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. అక్రమ మట్టి రవాణాతో అధిక లోడుతో నడుస్తున్న టిప్పర్లు గ్రామాల గుండా అతివేగంగా సంచరిస్తుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. రహదారులు దెబ్బతినడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో అప్పటి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఈ భూముల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించి, అన్యాక్రాంత కాకుండా కాలువ కట్టలపై విస్తృతంగా మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. ఈసందర్భంగా ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులను మందలించి తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కొంత మేర మొక్కలు నాటినప్పటికీ ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారిపోయిందని స్థానికులు చెబుతున్నారు. ప్రస్తుతం ఎక్కడ పడితే అక్కడ యథేచ్ఛగా మట్టి తవ్వకాలు జరుగుతున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు ఒకరిపై ఒకరు బాధ్యత నెట్టుకుంటూ తప్పించుకుంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆసక్తి కళ్లముందే మాయమవుతుండటంతో జిల్లా కలెక్టర్ దివాకర్ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ మట్టి తవ్వకాలను అరికట్టి, ఎన్ఎస్పీ భూములను పరిరక్షించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలి

-అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి
-సిపిఐ మణుగూరు పట్టణ కార్యదర్శి, తెలంగాణ విద్యార్థి జేఏసీ మాజీ కన్వీనర్ దుర్గ్యాల సుధాకర్



చేశారు. సోమవారం విలేకరులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జూన్ రెండవ తేదీ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించి 13 సంవత్సరాలు కావస్తున్న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొని అనేక కేసులు నిర్బంధాలను ఎదుర్కొనే జైలుపాలు, అనేక అరెస్టులతో ఎంతో మంది ఉద్యమకారులు ఉద్యమాలు చేశారని, అనేకమంది తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అమరులై తమ ప్రాణాలు తీసుకుని, రాష్ట్రం కోసం త్యాగం చేశారని,తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 13 సంవత్సరాలు కావస్తున్న నేటికి అమరులైన కుటుంబాలను గుర్తించటంలోగత ప్రభుత్వం 10 సంవత్సరాల విఫలమయ్యారని*దీనివలన నిరుద్యోగం విపరీతంగా పెరిగిపోయిందని ఉద్యమంలో పాల్గొన్న అనేక వేల మంది నిరుద్యోగ యువత వయస్సు పెరిగి పోయి ఉద్యోగ అవకాశాలు కోల్పోయే పరిస్థితికి చేరారు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి రాగానే తెలంగాణ అమరుల త్యాగాల పునాదులమీద ఏర్పడినది తెలంగాణ అని, ఉద్యమ కారులను, అమరవీరుల కుటుంబాలను గుర్తించి వారిని ఆదుకుంటామని చెప్పి, ప్రభుత్వం ఉద్యమ కారులకు ఇచ్చిన హామీ అమలు చేయాలని, నీరు, నిధులు, నియామకాల మీద అమలు జరిగేలా చేస్తామన్న మాటలను అమలు పరచాలని, తెలంగాణ ప్రభుత్వం ఉద్యమ కారులకోసం, వయోపరిమితి (వయసు సడలింపు) పెంచాలని, పింఛన్లు మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల కోసం అమరవీరుల కుటుంబాల కోసం ఒక కమిటీ ప్రతిపాదన వేసింది. ఆ కమిటీ నాలుగు రకాలుగా విభజనగా ఉద్యమ కారులను గుర్తిస్తామని ప్రకటన చేసిందని, ప్రభుత్వం, కమిటీ వెంటనే ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని వారు గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం కొన్ని వాగ్దానాలు చేసిందని ఆ వాగ్దానాలు అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త పెన్షన్ వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు కూడా అమలు జరగడం లేదని, వెంటనే కొత్త పెన్షన్ విధానం అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లలో రాజకీయ జోక్యం ఎక్కువైందని. అర్హత కలిగినటువంటి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జక్కుల రాజబాబు, సీనియర్ నాయకులు ఎస్కే సర్వర్, ఏఐటీయూసీ మణుగూరు మండల అధ్యక్ష, కార్యదర్శి రాయల బిక్షం, గడ్డం వెంకటేశ్వర్లు పట్టణ సహాయ కార్యదర్శి తోట రమేష్, చింతల దశరథం, ఎస్వి నాయుడు, కొత్తపల్లి సీతారాములు, బోసెట్ సంపత్ ఆధర్ల రాములు తదితరులు పాల్గొన్నారు.

# పంట అవశేషాలు తగలబెట్టొద్దు


-రైతులకు వ్యవసాయ శాఖ అవగాహన



ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండలంలోని గైగోళ్లపల్లి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పంట అవశేషాలను తగలబెట్టడం వల్ల భూమి సారవంతత దెబ్బతింటుందని, పర్యావరణానికి హాని కలుగుతుందని వివరించి, వాటిని భూమిలో కలియదున్నే విధానాలపై రైతులకు సూచనలు చేశారు. అలాగే నిషేధిత హెచ్‌టీఈ పత్తి సాగు, విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, విచాక్షణారహిత ఎరువుల వినియోగం వల్ల కలిగే కష్టాలు, నానో ఎరువుల ప్రయోజనాలు, నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో అనుమతి లేకుండా ఎవరైనా విత్తనాలు విక్రయిస్తే వెంటనే వ్యవసాయ శాఖకు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. కార్యక్రమం ముగింపులో పంట అవశేషాలను ఇకపై తగలబెట్టబోమని రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనూష సైదులు, వ్యవసాయ విస్తరణ అధికారులు అవినాష్, ప్రియాంకతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# ముందు చూపేది..?

- 2027 జూన్ 26 నుండి గోదావరి పుష్కరాలు
- రానున్నది వానా,వరదల కాలం
- ముందడుగు పడని పుష్కరాల పనులు
- రామాలయాభివృద్ధిదీ అదే తీరు
- పనులు చేసేందుకు ఆసక్తి చూపని గుత్తేదారులు
- రెండో సారి టెండర్లు పిలిచిన ఆర్అండ్‌బి శాఖ
- కాంట్రాక్టర్లు ఎందుకు ముందుకు రావటడం లేదో ?





ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : గోదావరి పుష్కరాలకు సరిగ్గా ఏడాదే సమయముంది. అందుకు సంబంధించిన పనుల ముందడుగు పడక పోవడంతో ప్రభుత్వానికి ముందుచూపు లేదంటూ భక్తులు విమర్శలు గుప్పిస్తున్నారు. వచ్చే ఏడాది జూన్ 26 నుండి జూలై 7 వరకు పుష్కరాలు జరగనున్నాయి. ఈ గోదావరి పుష్కరాలకు దేశ విదేశాల నుండి సుమారు కోటి మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. గత కొన్ని రోజుల క్రితం గోదావరి పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను కూడా కేటాయించింది. ఈ పనులను పంచాయితీ రాజ్ శాఖకు అప్పగించారు. ఇందుకు గానూ పాత పుష్కరఘాట్ల నిర్మాణం, నూతన ఘాట్ల గుర్తింపు ఏర్పాటును గోదావరికి ఇరువైపులా ఉన్న భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో చేపట్టాల్సి ఉంది. వీటికి సంబందించి రూ.15.5 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన ఆశాఖ ఇంత వరకు టెండర్లు పిలువలేదు. భద్రాచలం నియోజకవర్గంలో రూ.5 కోట్ల 35 లక్షలు, పినపాక నియోజకవర్గంలో రూ.8 కోట్ల అంచనాలతో టెండర్లు జరగాల్సి ఉంది. మిగతా పనులు ఆలయాభివృద్ధి నిధుల నుండే వెచ్చించనున్నట్లు తెలుస్తోంది.

**రామాలయాభివృద్ధి పనుల్లోనే అదే తీరు :**

రామాలయాభివృద్ధి పనుల్లోనూ పురోగతి లేదు. రూ.351 కోట్ల తొలి దశ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీరామనవమి నాడు భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పటికే ఒకసారి ఆర్అండ్‌బి శాఖ టెండర్లను పిలిచింది. అయినప్పటికీ ఒక్క టెండర్ కూడా దాఖలు కాకపోవడంతో రెండో సారి టెండర్లను ఆహ్వానించి జూన్ 9వ తేది నాటికి సమర్పించాలని సూచించారు.

**వర్షాకాలంలో పనులు సాగేనా :**

రానున్న నాలుగు మాసాల పాటు వర్షాలు, మరో ప్రక్క గోదావరి వరదలు ముంచుకురానున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఈ నాలుగు నెలలు పోను మిగిలింది కేవలం 8 నెలలు మాత్రమే మిగిలున్నాయి. పుష్కరాలకు సంబంధించి ఘాట్‌లు, రోడ్లు, నూతన ఘాట్లు ఏర్పాటు వంటి పనులు సాగేందుకు సమయం తక్కువగా ఉందని భక్తులు అంటున్నారు. అదే విధంగా రామాలయ పనుల్లో ఎలాంటి ముందడు లేకపోవడంతో రానున్న వర్షాలు, గోదావరి వరదల తర్వాత పనులు మొదలు పెడితే కూల్చవేతలు, కట్టడాలు సాగితే పుష్కరాల నాటికి పనులు పూర్తవుతాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుష్కరాలకు సుమారు కోటి మంది భక్తులు తరలివచ్చే అకాశం ఉందనే అంచనాలు ఉండగా ఆ నాటికి పనులు పూర్తికాక పోతే భక్తుల దర్శనాల, వసతులు, సౌకర్యాల సంగతి ఏంటనే ఆందోళన మొదలైంది.

**రెండో సారి అంతర్యమేంటో :**

రామాలయాభివృద్ధి పనులకు సంబంధించి సుమారు రూ. 200 కోట్ల అంచనాలతో ఆర్అండ్‌బి అధికారులు టెండర్లు ఆహ్వానించారు. అయిప్పటికీ కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో రెండో సారి పిలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. టెండర్లు పూర్తయి పనులు సాగుతాయని ఆశించి ఏప్రిల్ 28న కళావాహనం నిర్వహించి ఆళ్వార్లను, స్వర్ణ పూత వాహనాలతో పాటు మూల మూర్తులను కూడా ధ్యానమందిరం వద్ద ఉన్న బాలాలయానికి చిన్న జీయర్ స్వామి విశేషపూజల నుడమ తరలించారు. పనులకు సంబంధించి గుత్తేదారులు ఎందుకు ముందుకు రావడటం లేదు ? రెండో సారి టెండర్లు పిలువడం వెనుక ఆంతర్యం ఏమిటో అంటూ రామభక్తులు పెదవి విరుస్తున్నారు.

# మహిళ సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదు

**ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ లో ఎమ్మెల్యే పాయం**



ప్రజాపక్షం/మణుగూరు: మహిళల అభ్యున్నతే తెలంగాణ ప్రగతి అని, మహిళ సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మెప్మ ఆధ్వర్యంలో మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అర్హులైన మహిళలకు చీరలను పంపిణీ చేసి వారి సంక్షేమం పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలు కుటుంబ వ్యవస్థకు వెన్నెముకలని, మహిళ సాధికారత లేకుండా సమాజాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. మహిళలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత, విద్య, ఆరోగ్యం మరియు ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి కార్యక్రమం మహిళల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడంతో పాటు వారికి వివిధ రంగాల్లో శిక్షణ, రుణ సదుపాయాలు మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా బలపడితే కుటుంబం అభివృద్ధి చెందుతుందని, కుటుంబం అభివృద్ధి చెందితే సమాజం మరియు రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు పంపిణీ చేసిన ఈ చీరలు మహిళల పట్ల ప్రభుత్వానికి ఉన్న గౌరవం, ప్రేమ మరియు బాధ్యతకు ప్రతీకగా నిలుస్తాయని ఎమ్మెల్యే పాయం అన్నారు. ప్రతి పండుగ, ప్రతి శుభకార్యంలో మహిళలు ఆనందంగా పాల్గొనాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ వారి జీవితాల్లో సంతోషాన్ని నింపే దిశగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని చెప్పారు. అలాగే మహిళా సంఘాలు మరింత బలోపేతం కావాలని, మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అవకాశాలను మహిళలు పూర్తిస్థాయిలో వినియోగించుకొని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. మహిళలు సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో కీలక పాత్ర పోషిస్తూ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యతగా తీసుకొని పనిచేస్తోందని, మహిళలకు అవసరమైన ప్రతి రంగంలో అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో మహిళా సాధికారతకు చేపడుతున్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మెప్మ సిబ్బంది, మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, మహిళా సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## సింగరేణి మండలంలో బానోత్ మనీషా లక్ష్మీ విస్తృత పర్యటన



ప్రజాపక్షం/కారేపల్లి: వైరా నియోజకవర్గ మాజీ ఎంఎల్ఏ బానోత్ మదన్‌లాల్ కుమార్తె బానోత్ మనీషా లక్ష్మీ సోమవారం సింగరేణి మండలంలో విస్తృతంగా పర్యటించారు. భాగ్యనగర్ తండాలో అజ్మీరా కిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేకే ట్రేడర్స్ ఎరువుల దుకాణాన్ని ఆమె రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మాజీ జెడ్‌పిటిసి వాంకొడోత్ జగన్ నాయక్ నివాసంలో ఏర్పాటు చేసిన తేనేటీ విందులో పాల్గొన్నారు. అలాగే బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ ఇస్లావత్ బన్సీలాల్, సుజాత దంపతుల నివాసంలో జరిగిన ఆతిథ్య కార్యక్రమానికి హాజరయ్యారు. కారేపల్లిలో బీఆర్ఎస్ ఉద్యమకారుడు సోముధుల నాగరాజును పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా మైనారిటీ నాయకుడు ఎస్కే గౌసుద్దీన్ నివాసంలో నిర్వహించిన తేనీటి విందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమాల్లో మాజీ జెడ్‌పిటిసి వాంకొడోత్ జగన్ నాయక్, డోకేన రవీందర్, ఇస్లావత్ బన్సీలాల్, సుజాత, ఎస్కే గౌసుద్దీన్, మాజీ సర్పంచ్‌లు జర్పాల హచ్చు, మోహన్, జడల కళ్యాణ్, ధారావత్ వికాస్, బానోత్ రాజేష్, మణికొండ నాగేశ్వరరావు, తెలగర్ల రామారావు, మురళి, పేర్ని వెంకటేశ్వర్లు, పొదుగు హరీష్, రమేష్, మూతి కోటేశ్వరరావు, అజ్మీరా రవి, వెంకట్, ఖలీల్ ఖాన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠ్యపుస్తక రచనా కమిటీలో ఎంపికైన అధ్యాపకులకు సన్మానం



ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన చరిత్ర అధ్యాపకులు తమ్మిశెట్టి శ్రీనివాస్, మెకానికల్ ఇంజనీరింగ్ వొకేషనల్ అధ్యాపకులు దుర్గా ప్రసాద్‌లు ఇంటర్మీడియట్ బోర్డు పాఠ్యపుస్తక రచనా కమిటీలో సభ్యులుగా ఎంపిక కావడంతో కళాశాల ప్రధానాచార్యులు నోముల విజయ కుమారి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ప్రధానాచార్యులు నోముల విజయకుమారి మాట్లాడుతూ పాఠ్యపుస్తకాలు సరళమైన భాషలో ఉండి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా రూపొందించాలని, చదువుపై ఆసక్తి పెంపొందించే విధంగా రచనలు చేయాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విజ్ఞానాసక్తిని పెంచేలా పాఠ్యాంశాలు ఉండాలని ఆకాంక్షించారు. అదే విధంగా కళాశాలలో సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై బాధ్యతలు స్వీకరించిన నరేష్‌కు స్వాగతం పలుకుతూ అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సహచర అధ్యాపకులు నరేష్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, కళాశాల అభివృద్ధికి ఆయన సేవలు మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## వరదలపై అప్రమత్తంగా ఉండాలి

### -ఇన్‌చార్జి ఎంపీడీవో రవీంద్ర ప్రసాద్



ప్రజాపక్షం/కారేపల్లి: మండలంలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలను అప్రమత్తం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో మల్లెల రవీంద్ర ప్రసాద్ సూచించారు. గత ఏడాది వర్షాల సమయంలో 14 ప్రాంతాల్లో రహదారులు, లో లెవెల్ బ్రిడ్జిలపై వరద నీరు ప్రవహించిన నేపథ్యంలో ఆయా ప్రాంతాలతో పాటు ఇతర ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు ఆదేశించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెరువులు, వాగులు పొంగిపొర్లే సమయంలో ప్రజలు, పశువులు ప్రమాద ప్రాంతాలకు వెళ్లకుండా గ్రామస్థాయి సిబ్బంది చర్యలు తీసుకోవాలని తెలిపారు. చేపల వేట కోసం వరద నీటిలోకి వెళ్లకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పాడుబడిన ఇళ్లను గుర్తించి వాటిలో నివసించే కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లేలా చైతన్యం కల్పించాలని అన్నారు. అలాగే విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ విద్యుత్ లైన్ల సమీపంలో ఉండకూడదని ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. వర్షాకాలంలో తాగునీటి ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ నిర్వహించాలని, ప్రతి గ్రామ పంచాయితీలో బ్లీచింగ్ పౌడర్, సున్నం తగిన నిల్వలు ఉంచాలని కార్యదర్శులకు సూచించారు. ఈసమావేశంలో పీఆర్ ఏఈ రాజశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు నరేందర్‌రావు, నాగయ్య, హౌసింగ్ ఏఈ నాగేంద్రబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జిపిఎఫ్ బకాయిలను విడుదల చేయండి



**-హెల్త్ స్కీం విధి విధానాలు ప్రకటించండి**
**-పెన్షనర్ల సంఘం అధ్యక్షులు పరిశ పుల్లయ్య**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగులకు జిపిఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (ఎస్‌జిపిఏటి) జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం జిపిఎఫ్ విషయంలో అసంబద్ధ, అవాస్తవ ప్రకటనలను చేస్తుందని ఆయన ఆరోపించారు. ఎస్‌జిపిఏటి ముఖ్య కార్యకర్తల సమావేశం ఎస్‌జిపిఏటి కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పరిశ పుల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూటికి నూరు శాతం జిపిఎఫ్ బకాయిలను చెల్లించినట్లు ప్రకటించిందని కానీ ఇది పూర్తిగా సత్యదూరమైన ప్రకటన అన్నారు. బకాయిల చెల్లింపు విషయంలో 50 శాతం కూడా వాస్తవం లేదని ఆయన స్పష్టం చేశారు. 2025 మే ముందు ఉద్యోగ విరమణ చేసిన వారికి కమ్యూటేషన్ బకాయిలు చెల్లించినట్లు ప్రకటించారని కానీ ఇంకా అనేక మంది పెన్షనర్లకు బకాయిలు చెల్లించాల్సి ఉందని పుల్లయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హెల్త్ స్కీంను పెన్షనర్ల సంఘం స్వాగతిస్తుందని కానీ అందుకు సంబంధించిన విధి విధానాలను వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల వాటాగా 1.5 శాతం నిర్ణయించారని దీనిపై స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం హెల్త్ స్కీంకు సంబంధించి విధి విధానాలను వెంటనే ప్రకటించాలని పెన్షనర్ల అనుమానాలను నివృత్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా పెన్షనర్ల జిపిఎఫ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని 2025 మే నెలకు పూర్వం ఉద్యోగ విరమణ చేసిన వారికి కమ్యూటేషన్ బకాయిలు వెంటనే చెల్లించాలని ఆ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారికి కూడా బకాయిలు చెల్లించేవిధంగా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేరీ ఏసుపాదం, జిల్లా ప్రధాన కార్యదర్శి రాయల రవికుమార్, ఆర్థిక కార్యదర్శి గుర్రాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు పెదమాళ్ల సత్యనారాయణ, ఊడుగు వెంకటేశ్వర్లు, జల్లా వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ప్రసాదరావు, సుధాకర్, సీనియర్ కార్యకర్తలు శివకుమార్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలి

**-గుర్తింపు లేని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయండి**
**-ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గుర్తింపు లేని కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలను గుర్తించి సీజ్ చేయాలని, ఫీజుల నియంత్రణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి అధ్యక్షులు మడుపల్లి లక్ష్మ ణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మడుపల్లి లక్ష్మ ణ్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తూ కోట్ల రూపాయలు దండు కుంటున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కార్పొరేట్ విద్యా సంస్థలు ఫీజుల మోత మోగిస్తున్న విద్యాశాఖాధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప తగు చర్యలు తీసుకోవడం లేదన్నారు. గుర్తింపు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో అలసత్వం వహిస్తున్నారన్నారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు అడ్మిషన్ల సమయంలో డోనేషన్లతో పాటు బుక్స్, యూనిఫాం, షూ, టై, బెల్ట్ అంటూ అదనంగా దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఎస్సి, ఎస్టి, బిసి, మైనార్టీ విద్యార్థులకు 25 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని నిబంధన ఉన్న ఆ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారన్నారు. జర్నలిస్టు పిల్లలకు 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఇంటర్నేషనల్ పాఠశాలల పేరుతో నర్సరీ, ఎల్‌కెజి, యుకేజీలకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాల ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. గుర్తింపు లేని పాఠశాలలను సీజ్ చేయాలని ఫీజుల నియంత్రణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బుర్రా మనోజ్, నాయకులు పవన్, గోపి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో అందరికీ సముచిత స్థానం

**-మండల అధ్యక్షులను ప్రకటించిన డిసిసి**

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కాంగ్రెస్ పార్టీలో పని చేసిన ప్రతి ఒక్కరికి అధినాయకత్వ సహకారంతో సముచిత స్థానం కల్పిస్తామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ అధిష్టానం పార్టీ పురోభివృద్ధికి పనిచేసిన కార్యకర్తలకు అండగా నిలుస్తుందన్నారు. సత్తుపల్లి నియోజక వర్గంలోని పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులను నూతి సత్యనారాయణ సోమవారం ప్రకటించారు. తల్లాడ మండల అధ్యక్షులుగా గొడుగునూరి లక్ష్మి రెడ్డి, కల్లూరుకు పోట్రు అర్జునరావు, పెనుబల్లికి పి. వెంకటేశ్వరరావు, సత్తుపల్లికి బీమిరెడ్డి సుబ్బారెడ్డి, వేంసూరు మండల అధ్యక్షులుగా కాసర చంద్రశేఖర్ రెడ్డిలను నియమించినట్లు ఆయన తెలిపారు. సత్తుపల్లి పట్టణాధ్యక్షులుగా గాదె చెన్నకేశవరావు, కల్లూరు పట్టణాధ్యక్షులుగా షేక్ ఉస్మాన్‌ను ప్రకటించారు. ఈ ఎంపికకు సహకరించిన కాంగ్రెస్ నేతలకు నూతి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

## వివోఏలకు కనీస వేతనం వెంటనే అమలు చేయాలి

**- న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్రప్రసాద్**



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మహిళ ఆర్థికాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్న వివోఏలకు కనీస వేతనం అమలు చేయాలని, ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందించంలో వారు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారని, వివోఏల సేవలను ప్రభుత్వం గుర్తించి వెంటనే సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేసే వారికి కనీస వేతనం అమలు చేయాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మందుల రాజేంద్రప్రసాద్, మండల కార్యదర్శి గొర్రెపాటి రమేష్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివోఏలు చేస్తున్న సమ్మెలో భాగంగా 11వరోజు దీక్షకు న్యూడెమోక్రసీ పూర్తి మద్దతు తెలిపి వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సుమారు 30సంవత్సరాల నుంచి ఐకెపి సెర్ప్ సంస్థలో వివోఏలుగా విధులు నిర్వహిస్తూ పొదుపు సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వివోఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యూడెమోక్రసీ డివిజన్ నాయకులు వచ్చాయి పుల్లయ్య, పోలపొంగ నాధయ్య, మన్సూర్ సైదులు, కొమరయ్య, వివోల జెఏసి జిల్లా అధ్యక్షురాలు వేల్పుల సుశీల, మండల ప్రధాన కార్యదర్శి గుగ్గిళ్ళ ఉమా, పోలిశెట్టి అరుణ, మెట్టు స్వరూపరాణి, ఎం.స్రవంతి, మేకల కృష్ణవేణి, బొడ్డు కుసుమ, గోపోజి ఉపేంద్ర, పోలూరి విజయలక్ష్మి, మండాది కళమ్మ, గుంటి ధనలక్ష్మి, సామినేని కరుణ, గద్దల జ్యోతి, విజయ, లలిత, శ్రావణి, జయకుమారి, మంజుల, ధరావత్ జయ తదితరులు పాల్గొన్నారు.

## నేడు టివి చౌదరి వర్ధంతి సభ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** సుదీర్ఘ కాలం పాటు సిపిఐ ఉమ్మడి ఖమ్మం జిల్లా సారథిగా, రాష్ట్ర రైతు సంఘం నాయకునిగా విశిష్ట సేవలు అందించిన టివి చౌదరి ఆరవ వర్ధంతి సభ మంగళవారం సిపిఐ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు జరుగుతుందని జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. రైతు సంఘం నేతగా, కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ఖమ్మంజిల్లాలో టివి చౌదరి పలు ఉద్యమాలకు నేతృత్వం వహించారని ఆయన తెలిపారు. తుది శ్వాస వరకు పేదల అభ్యున్నతి కోసం కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధి కోసం కృషి చేసిన చౌదరి ధన్యజీవి అన్నారు. వర్ధంతి సభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా, పలువురు జిల్లా, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని సురేష్ తెలిపారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం పెవిలియన్ మైదానం వద్ద గల అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించడం జరుగుతుందని పార్టీ కార్యకర్తలు , నాయకులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

## పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేశారు. సోమవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సొసైటీ ఛైర్మన్ రావూరి సైదుబాబు, వైస్ ఛైర్మన్ రావెళ్ల శ్రీనివాసరావు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను , జనుములు, జీలుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సైదుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జిలుగులు పంపిణీ చేస్తుందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాలు చల్లి వాటిని భూమిలో కలియదున్నితే సేంద్రియ కార్బన్ మెరుగవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఏవో కిషోర్, సొసైటీ సెక్రటరీ ఐతగాని తిరుపతిరావు, ఏఈవో శిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన పాలిసెట్ కౌన్సిలింగ్



**ప్రజాపక్షం/ ఖమ్మం :** పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాలకు సంబంధించి కౌన్సిలింగ్ ముగిసింది. గడిచిన నాలుగు రోజులుగా స్థానిక ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో జరుగుతున్న కౌన్సిలింగ్‌కు 305 మంది వివిధ స్లాట్ల ద్వారా నమోదు చేసుకోగా ఇందులో 285 మంది కౌన్సిలింగ్‌కు హాజరయ్యారని ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా॥ మహ్మద్ జాకీరుల్లా తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశం నిర్వహించారు. సోమవారం ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా నిర్మించిన ఇండ్ల గృహప్రవేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాపా ఆదినారాయణ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ పథకం ద్వారా ఇండ్లను అందిస్తుందని తెలిపారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్‌కుమార్, పాలక వర్గ సభ్యులు బానోత్ రమేష్ నాయక్, మూకర ఉమా, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగులకు వీడ్కోలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పదవి విరమణ పొందిన ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన 11 మంది ఉద్యోగులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి పాల్గొని ఉద్యోగుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 30 నుంచి 35 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలు నిర్వీరామంగా అందించి నేడు పదవి విరమణ పొందుతున్న అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పదవి విరమణ అనంతరం వారి జీవితం ప్రశాంతంగా, ఆరోగ్యవంతంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అనంతరం పదవి విరమణ పొందిన ఉద్యోగులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పదవి విరమణ పొందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంరూరల్ ఆర్ఐ-1గా జానీ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ)గా జానీ నియమితులయ్యారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్ఐ ప్రసాద్ ముదిగొండ మండలానికి బదిలీ కాగా, అక్కడి నుంచి జానీ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ప్రజాపక్షంతో సోమవారం ఆయన మాట్లాడారు...ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. మండల ప్రజలు, రైతులు, ప్రజాప్రతినిధులు, రాజకీయనాయకులు తమకు సహకరించాలని కోరారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తూ రెవెన్యూ శాఖ సేవలను పారదర్శకంగా అందించేందుకు కట్టుబడి ఉంటానని ఆయన పేర్కొన్నారు.

# భగత్‌వీడులో భగ్గుమన్న రాజకీయ కక్షలు..!

**-బీఆర్ఎస్ రైతులకు చెందిన గడ్డివాముల దగ్ధం**
**-కాంగ్రెస్ నేతల పనేనని బిఆర్ఎస్ సర్పంచ్ ఆరోపణ**







**ప్రజాపక్షం/కూసుమంచి:** పార్టీ కక్షల నేపథ్యంలో 7 గడ్డివాములను తగలబెట్టిన ఘటన ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని భగత్‌వీడు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గత నాలుగు రోజులుగా బిఆర్ఎస్ నాయకులకు చెందిన గడ్డివాములను అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తగలబెడుతున్నారని ఆరోపించారు. ఇదే విషయమై గత నాలుగు రోజుల క్రితం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఫలితం లేదని వాపోయారు. రాజకీయంగా తమని ఎదుర్కోలేక పశువులు తినే గడ్డికి నిప్పు పెట్టడమేంటని తమ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు చెందిన 7 గడ్డివాములు(సుమారు 2,900)గడ్డి మోపులు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా అగ్నికి ఆహుతవడంతో సుమారు రెండు లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు స్థానిక రైతులు తెలిపారు. భూక్య విష్ణు350(రెండు దఫాలుగా గడ్డి వాములు దగ్ధం), ననావత్ ప్రభాకర్ 300 గడ్డి మోపులు, దరంసో సక్రం 400 మోపులు, బానోతు సక్రు 550 మోపులు, భూక్యా మోత 300, అజ్మీరా లక్ష్మణ్ 700, దరావత్ లచ్చు 350ల గడ్డి వాములు దగ్ధమయ్యాయి. న్యాయం కోసం పోలీస్ స్టేషన్ మెట్లెక్కితే ఫిర్యాదు తీసుకున్నారు తప్ప తమకు ఏరకమైన న్యాయం జరగలేదని వాపోయారు. అయినప్పటికీ కూడా ఆగకుండా బీఆర్ఎస్‌కు చెందిన రైతులు భూక్యా విష్ణు, బానోతు సక్రులకు చెందిన గడ్డి వాములను రెండు దఫాలుగా ఉద్దేశపూర్వకంగా దగ్ధం చేశారని బాధితులు ఆరోపించారు. ఇవన్నీ స్థానిక గ్రామ సర్పంచ్ భూక్యా వసంత బంధువులకు చెందిన గడ్డివాములే కావడం గమనార్హం. కేవలం బిఆర్ఎస్‌కు చెందిన వారి గడ్డిమోపులనే టార్గెట్గా చేసుకొని తగలబెట్టడం జరిగిందని బీఆర్ఎస్ పార్టీకి చెందిన స్థానిక సర్పంచ్ భూక్యా వసంత ఆరోపించారు. దీనికి ప్రతీకారంగా గ్రామంలో కాంగ్రెస్ వారి ఆస్తులపై ఏ రకమైన చర్యలకు పాల్పడలేదని, కేవలం గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఓటమి పాలు చెందారానే, బీఆర్ఎస్ గెలుపుని జీర్ణించుకోలేనీ కాంగ్రెస్ కార్యకర్త భూక్యా హట్యా గ్రామంలో ఈ చర్యలకు పాల్పడుతూ గడ్డివాములు దగ్ధం చేస్తున్నాడని బాధితులు తెలిపారు. గత నాలుగు రోజులుగా గడ్డివాములు ఎవరు దగ్ధం చేస్తున్నారని అనుమానంతో రాత్రిలంతా గస్తి నిర్వహించగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన భూక్యా హట్యా దొరికాడని ఆదివారం ఉదయం గ్రామస్తుల సమక్షంలో విచారించగా తను గడ్డి వాములకు నిప్పు పెట్టిన తప్పును ఒప్పుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

### చేతబడి వ్యవహారంపై పోలీసుల వరకు చేరిన తగవు...

ఇదే గ్రామంలో 2022 సంవత్సరంలో గ్రామంలో బాణామతి(చేతబడి)చేస్తూ పసుపు కుంకుమలతో తమకి పడని వ్యక్తుల ఇంటి ముందు లేక వారి యొక్క పరిసర ప్రాంతాల్లో ఒకరిపై ఒకరు నిమ్మకాయలు పసుపు కుంకుమలు వేసి మీరంటే మీరే అంటూ తగవులు పెట్టుకొని చిలికి చిలికి గాలి వానగా మారి పెద్ద ఎత్తున ఆందోళనలకు దారి తీసి పోలీస్ స్టేషన్ వరకు కేసులు ఇంకా గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అంత వరకు జరిగింది. ఈవిషయాలు అన్నీ గ్రామంలో ప్రజలు మర్చిపోకముందే రెండో ఘటనగా గడ్డివాముల దగ్ధం కావడం గ్రామంలో ఇంకా భవిష్యత్తులో ఏ రకమైన కొత్త కొత్త దాడులు లేక హత్యా ప్రయత్నాలు, హత్యలు ఊహించని విధంగా జరుగుతాయోమో అంటూ గ్రామంలో ప్రజలు జరగబోయే ప్రమాదాన్ని ఊహిస్తూ తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు ఈ గ్రామంపై కట్టు దిట్టమైన చర్యలు చేపట్టకపోతే ప్రమాదం పొంచి ఉందని గ్రామంలోని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### గడ్డివాములకు నిప్పు పెట్టిన వ్యక్తికి దండగ...

భగత్‌వీడు గ్రామంలో గత నాలుగు రోజులుగా గడ్డివాములకు నిప్పు పెట్టిన వ్యక్తిని శనివారం తెల్లవారుజామున గుర్తించిన రైతులు ఆదివారం ఉదయం గ్రామంలో ప్రజల సమక్షంలో అతని పేరు భూక్యా హట్యాగా ప్రకటించి అతన్ని ప్రజల్లోకి పిలిపించి గ్రామ పెద్దలు సుమారు రూ 1,75,000పైబడి దండగ వేసినట్లు గ్రామ ప్రజలు తెలిపారు. గడ్డివాముల దగ్ధం విషయంపై కూసుమంచి ఎస్ఐ నాగరాజుని వివరణ కోరగా గత నాలుగు రోజుల నుంచి ఆదివారం వరకు గడ్డివాములు దగ్ధమైన విషయం తన నోటీసుకు వచ్చిందని, ప్రస్తుతం భగత్‌వీడు తండా పంచాయితీ నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేస్తామని తెలిపారు. తాము పట్టించుకోకవడం లేదనే దాంట్లో వాస్తవం లేదని ఇప్పటికే తమ పోలీసుల్ని ఆ గ్రామంలో గస్తీకి పంపుతున్నామని తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ళు.. పేదల కన్నీటి జల్లు..!

**-స్థానిక ఇసుక రవాణా లేక నిలిచిన నిర్మాణాలు**
**-ఇందిరమ్మ రాజ్యం కాదు.. కన్నీటి కాష్టం**
**-తక్షణమే ఇసుక రవాణా పునరుద్ధరణ చేయాలి**
**-ప్రజావాణిలో అదనపు కలెక్టర్ విద్యాచందనకు మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ వినతి**



**ప్రజాపక్షం/మణుగూరు:** పినపాక నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఇసుక కొరతతో నిలిచిపోయాయని మాజీ జెడ్పీటీసీ పాల్వంచ దుర్గ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఐడిఓసి కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందనకు దుర్గ వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి నది పరివాహక ప్రాంతంలో పుష్కలంగా ఇసుక లభిస్తున్నప్పటికీ, ఇందిరమ్మ ఇండ్ల స్థానిక పేద లబ్ధిదారులకు అందుబాటులో లేకపోవడం దురదృష్టకరమన్నారు. మరోవైపు అక్రమ ఇసుక రవాణా విచ్చలవిడిగా కొనసాగుతుండటంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇళ్ల నిర్మాణాల కోసం అప్పులు చేసి పునాదులు వేసుకున్న అనేక నిరుపేద కుటుంబాలు ఇసుక దొరకక, పనులు ముందుకు సాగక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం పేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ, ఇసుక కొరత కారణంగా ఆ లక్ష్యం నెరవేరడం లేదని అన్నారు. జిల్లా యంత్రాంగానికి అయిదు కీలక విజ్ఞప్తులు చేస్తూపాల్వంచ దుర్గ జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. పినపాకలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి కఠిన చర్యలు తీసుకోవాలని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల కోసం ప్రత్యేక ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని, లబ్ధిదారులకు సబ్సిడీపై లేదా ఉచితంగా ఇసుక సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని,మండల స్థాయిలో నోడల్ అధికారులను నియమించి ఇసుక పంపిణీని పర్యవేక్షించాలని, నిలిచిపోయిన గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. పేదల సొంతింటి కల సాకారం కావాలంటే ఇసుక సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి జిల్లా యంత్రాంగం తక్షణ చర్యలు చేపట్టాలని పాల్వంచ దుర్గ విజ్ఞప్తి చేశారు.

# ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలి

**-ప్రజావాణిలో అర్జీలను స్వీకరించిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ప్రజా వినతులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి లతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కామేపల్లి మండలం సాతానిగూడెం గ్రామానికి చెందిన కన్నేటి రంగయ్య ముచ్చర్ల రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెం 255, 262లో 6.20 ఎకరాల వ్యవసాయ సాగు భూమి ఉందని పొలంలోకి వెళ్లుటకు దారి చూపించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. వెన్నెల తనకు తల్లితండ్రులు లేరని పదవ తరగతిలో 493 మార్కులతో ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తనకు ఎంపిహెచ్‌డబ్ల్యూ లో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కె. వెంకటేశ్వర్లు భవన నిర్మాణ కార్మికులకు అందించే ప్రసూతి ఆర్థిక సహాయం తనకు అందించాలని కోరుతూ దరఖాస్తు చేశారు. ఆయా దరఖాస్తులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని పడమటి నరసాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల నూతన గృహాన్ని గురువారం స్థానిక ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజల సొంత ఇల్లు కలలను సాకారం చేయడం ఆనందంగా ఉందన్నారు. గ్రామ గ్రామంలో ఈ పథకానికి ప్రజలు చూపుతున్న ఆదరణ పై కాంగ్రెస్ పార్టీ తరఫున గర్వంగా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, కొత్త రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలు అమలు చేస్తూ పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్లు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఇందిరమ్మ ఇళ్ల సామూహిక గృహ ప్రవేశాలు



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవ వారోత్సవాలు బూర్గంపాడు మండలంలో ఘనంగా జరిగాయి. పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రాష్ట్రంలోనే అత్యధికంగా పినపాక నియోజకవర్గంలో నిర్మాణంలో ఉన్న 4,500 ఇందిరమ్మ ఇళ్లలో భాగంగా, బూర్గంపాడు మండలంలోని 18 గ్రామ పంచాయితీల పరిధిలో పూర్తయిన 232 ఇళ్లకు ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో సామూహిక గృహ ప్రవేశ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. నూతన గృహాల్లోకి అడుగు పెట్టిన లబ్దిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి, ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, హౌసింగ్ ఏఈ ఉదయ్‌కిరణ్, మండల స్థాయి అధికారులు, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మండల పరిషత్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# నెరవేరని కల..!

## -సాధన కోసం మరో ఉద్యమం




ప్రజాపక్షం/ ఖమ్మం : ఆరు దశాబ్దాల పోరాటం, ఎందరో అమరుల రక్తతర్పణం, వెలకట్టలేని త్యాగాలు, అలుపెరుగని ప్రజా ఉద్యమాలు అమరుల త్యాగ ఫలమో పట్టువిడవని పోరాట పటిమ, త్యాగాలు మొత్తంగా తెలంగాణను సాధించిపెట్టాయి. తెలంగాణ ఏర్పడితే ఏమి జరుగుతుందని ఏమి జరగాలని, తెలంగాణ సాధన కోసం పోరాడిన వారు కలలు కన్నారో ఆ కలలు నెరవేరలేదు. నిధులు, నీళ్లు, నియామకాలు ఈ మూడింటి కోసమే జరిగిన పోరాటం ఇప్పుడు ఆ మూడు దక్కక ఉద్యమకారులు నిరాశకు గురవుతున్నారు. స్వరాష్ట్రం సిద్ధిస్తే మన నిధులు మనకు దక్కుతాయని భావించారు. పాలకులు ఎవరైనా సరే మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ అప్పుల ఊబిలో కూరుకుపోయింది. అధికారపు వెంపర్లాటలో సాధ్యాసాధ్యాలను మరిచి కురిపించిన వాగ్దానాలు రాష్ట్ర ఆర్థిక భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేస్తున్నాయి. స్వయంగా ఆర్థిక మంత్రే ఆర్థిక పరిస్థితి బాగోలేదని వ్యాఖ్యానించడం లోటు బడ్జెట్‌కు అద్దం పడుతుంది. ఇక నీళ్లు పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం కట్టారు. అది అవినీత మయమని విపక్షాలు ఆరోపించాయి. అది కాళేశ్వరం కాదు కూలేశ్వరం అన్నారు. కాళేశ్వరాన్ని పక్కనపెడితే నీళ్ల కోసం జరిగిన ప్రయత్నమేమిటి. శంకుస్థాపనలు, నిధులు లేక పనుల్లో జాప్యం, చివరకు ఎప్పటికి పూర్తవుతాయో ఎన్నేళ్లకు సాగునీటిని అందిస్తాయో తెలియని అయోమయ పరిస్థితి. ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసే సీతారామ 2016లో శంకుస్థాపన జరిగింది. 2018కు పూర్తి కావాలి ఇప్పుడు 2026లో ఉన్నాం ఇదే రీతిగా నిధులు కేటాయిస్తే మరో ఐదేండ్లకు కూడా ఈ ప్రాజెక్టు పూర్తవుతుందన్న నమ్మకం లేదు. ఇందుకు భిన్నంగా లేదు రాష్ట్రంలోని మిగిలిన ప్రాజెక్టుల పరిస్థితి. ఇక నియమాకాలు తెలంగాణ సాధించుకున్నదే మన ఉద్యోగాలు మనకు దక్కేందుకే అన్నారు. దశాబ్ద కాలం పాటు పాలించిన వారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో అందరికీ విధితమే. వారి చేత కాలేదు మమ్మల్ని ఓ సారి చూడండి అన్నారు. యువత నిరుద్యోగుల తల్లిదండ్రులు ఓకే అన్నారు. రెండున్నర ఏళ్లలో నియామకాలు ఎన్ని జరిగాయి. తెలంగాణలో ఉన్న నిరుద్యోగుల సంఖ్య ఎంత, ఉద్యోగాల కల్పన ఎంత అన్నది పరిశీలిస్తే నక్కకు నాగలోకానికి ఉన్నంత ఉంది. ఒకటి మాత్రం నిజం అధికారంపై మమకారం ఉన్నప్పుడు ఇటువంటివి జరుగుతూనే ఉంటాయి. తెలంగాణను వ్యతిరేకించిన వారు, అస్థిత్వాన్ని ప్రశ్నించిన వారు తెలంగాణ పేరు ఎత్తితే ఉలిక్కి పడ్డ వారు చివరకు రంగులు మార్చి పాలకులు అయ్యారు. తెలంగాణను ఏలారు ఏలుతున్నారు. తెలంగాణను తెలంగాణ సాధిస్తే ఏమి జరుగుతుందని భావించారు. ఇప్పుడు ఏమి జరుగుతుంది. ఒక్కసారి పరిశీలిన చేసుకోవాల్సిన అవసరం ఉంది. కల్లాల్లో , కొనుగోలు కేంద్రాల్లో రైతుల అర్తనాదాలు వినపడుతున్నాయి. పండించడానికి పడే శ్రమ కంటే వ్యవసాయ ఉత్పత్తుల విక్రయాలకు పడే శ్రమ ఎక్కువగా ఉంది. కార్మికులు, యువత, మహిళలు ఏ ఒక్కరూ ఈ తెలంగాణలో సౌక్యంగా లేరు. గత పాలకులు ప్రశ్నించే వారిపై కక్షకట్టారు. ఇప్పుడు ప్రశ్నించిన సమాధానం చెప్పే వారు కరువయ్యారు. ఏసిబి దాడులు చూస్తుంటే అవినీతి తారాస్థాయికి చేరిందన్న భావన సర్వత్రా వ్యక్తమవుతుంది. తెలంగాణ ఏర్పడిన 13 ఏళ్ల తర్వాత మళ్లీ అదే ఆక్రమణలు, అదే ఆంధ్రా పెత్తందారుల భూ ఆక్రమణలు. నిన్న, మొన్న కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమించారని మీడియాలో వార్తలు. ఏమి మారింది, ఏమి ఆశించాం. ఇదేనా ఆశించిన తెలంగాణ. కానే కాదు అధికార పీఠాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించడం కాదు తెలంగాణ ఏర్పాటు లక్ష్య సాధన వైపు అడుగులు వేయాలి. ప్రజల్లో సైతం మార్పు రావాలి. మనం సాధించిన తెలంగాణలో సామాన్యులకు న్యాయం జరగాలి. ఆ దిశగా మరో కదలిక మొదలు కావాలి. ఆ కదలికే తెలంగాణ ఏర్పాటు లక్ష్యాలను సాధించగలుగుతుంది. చిత్తశుద్ధి లేని ఏలికలు, పాలకులు మారినంత మాత్రాన ఒరిగేది ఏమి లేదు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఏర్పాటు వెనక ఉన్న లక్ష్యాలను సాధించేందుకు పునరంకితమవుదాం.

# వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైంది..

**-వైస్ ఛాన్సలర్ రమేష్‌రెడ్డి**
**-మమతలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే**





ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని కాళోజి నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. రమేష్‌రెడ్డి తెలిపారు. మమత మెడికల్ కళాశాల, డెంటల్ కళాశాల, నర్సింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు మమత ఆసుపత్రి ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కె. రమేష్‌రెడ్డి హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో ఉన్నతమైందని ప్రజలకు సేవ చేసే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. మమత వైద్య సంస్థల సెక్రటరీ పువ్వాడ జయశ్రీ మాట్లాడుతూ సమాజానికి నాణ్యమైన వైద్యులను అందించడమే లక్ష్యంగా మమత వైద్య సంస్థలను స్థాపించినట్లు తెలిపారు. తమ కళాశాలలో ఆధునీక సౌకర్యాలతో పాటు మెరుగైన వైద్య విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మమత వైద్య సంస్థలకు మంచి గుర్తింపు ఉందన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు.గ్రాడ్యుయేషన్ పట్టా అందుకున్న పిల్లలతో వారి తల్లిదండ్రులు ఆనందాన్ని పంచుకుంటూ సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ పువ్వాడ నరేన్, ప్రిన్సిపాల్ అనురాధ,వెంకటేశ్వర్లు, వైష్ణవి పాల్గొన్నారు.

# వైరా మున్సిపాలిటీని వేధిస్తున్న రెగ్యులర్ ఉద్యోగుల కొరత..!



**-ఆరుగురు మాత్రమే రెగ్యులర్ ఉద్యోగులు**
**-40 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాలి**
**-డిప్యుటేషన్‌పై వెళ్లిన ఆరుగురు ఉద్యోగులు**

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీలో రెగ్యులర్ సిబ్బంది కొరత వేధిస్తూ ఉంది. వైరా మున్సిపాలిటీలో సుమారు 40 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండాలి. మున్సిపాలిటీలో ప్రస్తుతం ఆరుగురు రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారు. అందులో ముగ్గురు వార్డు ఆఫీసర్లుగా విధులు నిర్వహిస్తున్నారు. రెగ్యులర్ సిబ్బంది లేక మున్సిపాలిటీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడంతో ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కీలకమైన బాధ్యతలు అప్పజెప్పిన నేపద్యంలో పలు అవినీతి విమర్శలు సైతం గడిచిన సంవత్సరాల నుండి వినిపిస్తూ ఉన్నాయి. వైరా మున్సిపాలిటీలో 20 వార్డులు ఉన్నాయి. ప్రతి వాటికి ఒక వార్డు ఆఫీసర్ ఉండాలి. 20 మంది రెగ్యులర్ సిబ్బంది ఉండాలి. రెగ్యులర్ ఉద్యోగులు లేకపోవడం వలన పనుల్లో జాప్యంజరుగుతుందని చెప్పవచ్చును. వైరా మున్సిపాలిటీలో ఐదుగురు రెగ్యులర్ ఉద్యోగులు డిప్యూటేషన్‌పై పలు మున్సిపాలిటీలకు వెళ్లారు. ఆ డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులు ఖాళీలు నేటి వరకు భర్తీ కాలేదు. ఇక్కడికి రావానికి కొంతమంది అధికారులు ఎవరు ఆసక్తి చూపకపోవడంతో వైరా మున్సిపాలిటీకి అధికారుల కొరత వేధిస్తూ ఉంది. నూతన కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రామచంద్రరావు రెగ్యులర్ సిబ్బంది నియామకానికి కృషి చేస్తారా, స్థానిక శాసనసభ్యులు సహకారంతో అధికారులను నియమించుకుంటారా, లేక డిప్యూటేషన్‌పై వెళ్లిన అధికారులను వెనకకు పిలిపిస్తారా, సిబ్బందిని ఏ విధంగా నియమిస్తారో అనే దానిపై వేచిచూడాలి.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**-కార్పోరేషన్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించండి**
**-సిపిఎం నేత బివి రాఘవులు**




ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పని చేయాలని సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు కోరారు. రానున్న ఖమ్మం కార్పోరేషన్ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు. సుందరయ్య భవన్‌లో ఖమ్మం డివిజన్ వర్క్ షాప్ సోమవారం భూక్యా శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. వర్క్‌షాప్‌కు ముఖ్య అతిథిగా హాజరైన బివి రాఘవులు మాట్లాడుతూ ఖమ్మం మున్సిపల్ ఛైర్మన్‌గా చిర్రావూరి లక్ష్మి నర్సయ్య ఆ తర్వాత అఫ్రోజ్ సమీనా చిత్తశుద్ధితో, నిజాయితీతో పని చేశారన్నారు. ఖమ్మం నగరంలో ఏ సమస్య వచ్చినా ప్రజల వైపు నిలబడి ఆందోళనలు చేసే ఏకైక పార్టీ సిపిఎం మాత్రమేనన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా సమస్యలను గాలికి వదిలి పాలన సాగిస్తుందన్నారు. అంబానీ, అదానీలకు దోచి పెట్టడమే మోడీకి పెద్ద పనిగా మారిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాఘవులు డిమాండ్ చేశారు. ఈ వర్క్‌షాపులో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, డివిజన్ కార్యదర్శి వై. విక్రం, జిల్లా నాయకులు బొంతు రాంబాబు, యర్రా శ్రీనివాస్, బండారు రమేష్, జబ్బార్, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

**-ఈనెల 12 వరకు పర్యావరణ సంరక్షణపై కార్యక్రమాలు**
**- పోస్టర్లను ఆవిష్కరించిన కలెక్టర్**



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యతగా భావించి ప్రకృతి సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డిఎఫ్‌వో అనూజ్ అగర్వాల్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి పులిగుండల ఎకో టూరిజం ప్రాజెక్టు, పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకం నివారణ పోస్టర్ లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆవిష్కరించారు. ఈ సందర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జున్ ఒకటి నుంచి 12 వరకు పర్యావరణ సంరక్షణ అంశంపై జిల్లా వ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ప్రకృతిని సంరక్షిస్తేనే భవిష్యత్తు తరాలకు మెరుగైన జీవన వాతావరణాన్ని అందించగలమన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించుకోవాలని, పూర్తి స్థాయిలో నిరోధించేందుకు అందరూ సహకరించాలని సూచించారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని తెలిపారు. మొక్కలను కాపాడితేనే భవిష్యత్ తరాల జీవనం మెరుగ్గా ఉంటుందన్నారు. నేడు పర్యావరణ పరిరక్షణలో నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించరన్నారు. జిల్లాలో పచ్చదనాన్ని పెంపొందించే దిశగా విస్తృతంగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి కార్యాలయ సిబ్బంది, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వరదల పట్ల అధికారులు సంసిద్ధంగా ఉండాలి



ప్రజాపక్షం/కల్లూరు: వరదల పట్ల అధికారులు సంసిద్ధంగా ఉండాలని ఎంపీడీవో కార్యాలయంలో తహశీల్దార్ బ్రహ్మేశ్వర రావు, ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రాబోయే వర్షాకాలంలో వరదలను ఎదుర్కోవడానికి అధికారులు సిద్ధమై ఉండాలని అధికారులకు తహశీల్దార్ ఎంపీడీవో లు సూచించారు. మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం, కొర్లగూడెం, లక్ష్మీ పురం, పోచవరం ఆయా గ్రామాల వద్ద లో వంతెనలు లోతట్టుగా ఉండటంతో అలుగు వాగుల వద్ద వరద ప్రవాహం ఎక్కువగా ఉంటుందని ఆ ప్రాంతాలలో అధికారులు ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపిఎ పిఎమ్ అశోక రాణి, పోలీస్ శాఖ తరపున హెడ్ కానిస్టేబుల్ ఎన్‌ఎస్పి శాఖ అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజా, మిషన్ భగీరథ చక్రవర్తి, ఐసిడిఎస్ శాఖ సూపర్వైజర్ లతోపాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సమ్మె పట్ల ప్రభుత్వం స్పందించాలి




ప్రజాపక్షం/కల్లూరు: ఐకెపి వివో ఏలు గత 14 రోజులుగా చేస్తున్న సమ్మె పట్ల ప్రభుత్వం స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం కల్లూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ కు ఐకెపి వివో ఏలు సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందించారు. కనీస వేతన చట్టం అమలు పరచాలని హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని వివో ఏల ఖాతాలో వేతనాలు నేరుగా జమ చేయాలని, గ్రేడింగ్ విధానం రద్దు చేయాలని తదితర సమస్యలపై ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. సమ్మెకు స్పందించనిచో ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐకెపి వివోఏ ల అధ్యక్షురాలు వేము నాగమణి, కార్యదర్శి నీలవేణి, నాయకులు వెంకట్రావమ్మ, రజిత, కళావతి, మాధవి, మరియమ్మ, కృష్ణవేణి, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.